బీఆర్ఎస్ కార్యకర్తకు ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

సురేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి (సాగర్), జనవరి 19 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు పాతనబోయిన సురేశ్ తల్లి ఇటీవల పాము కాటుకు గురై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి ఆదివారం సురేశ్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగెండ్ల వెంకట్‌రెడ్డి, రాంబాబు, వనమాలు, పాతనబోయిన భాస్కర్, మల్లయ్యయాదవ్, ప్రశాంత్, పెద్ద భాస్కర్, గోపి, నరేశ్, నేతి శంకరయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి : ఎమ్మెల్యే వీరేశం

మినీ స్టేడియంలో షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జనవరి 19 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య స్మారకార్థం ఉమ్మడి నల్లగొండ జిల్లా షటిల్ డబుల్స్, క్రికెట్ క్రీడలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నకిరేకల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు, మినీస్టేడియం అధ్యక్షుడు కొండ యాదగిరి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు నోముల గోవిందరాజులు, బొజ్జ సుందర్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బాలూనాయక్

ఖిల్లా పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జనవరి 19 : పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలో ఆదివారం ఆయన ఖిల్లా పార్క్‌ను ప్రారంభించి మాట్లాడారు. పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఈ పార్క్ ఉపయోగపడనుందన్నారు. దేవరకొండ ఖిల్లా దుర్గంతో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ సుదర్శన్, సిరాజ్‌ఖాన్, ముక్కాముల వెంకటయ్యగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రాహత్‌అలీ, నాయకులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి : కొండేటి

నిడమనూరులో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీను

నిడమనూరు, జనవరి 19 : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి నాలుగు రోజుల పాటు జరుగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం మహాసభల వాల్‌పోస్టర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కొమాండ్ల గురవయ్య, వింజమూరి శివ, కుంచం శేఖర్, బొడ్డు లింగయ్య, శంకర్, ఎల్లయ్య, రావులపాటి శ్రీను, రవి తదితరులున్నారు.

చిట్యాల : మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య విడుదల చేశారు. కార్యక్రమంలో జిట్ట సరోజ, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, అయితరాజు నర్సింహ, గుడిసె లక్ష్మీనారాయణ, పెర్క శంకరయ్య, ఏళ్ల మారయ్య, పాలాకుల అర్జున్, నర్సింహ పాల్గొన్నారు.

నల్లగొండ సిటీ : కనగల్ మండల కేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహసభల పోస్టర్‌ను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి ఆవిష్కరించారు. కానుగు లింగస్వామి, మండల కమిటీ సభ్యులు కందుల సైదులు, ఎస్‌కే సుల్తానా, బొంగరి భిక్షం, రాంబాబు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దవూర, జనవరి 19 : మండల కేంద్రంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాలు.. మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన నిమ్మల సతీశ్ తన బైక్‌పై వ్యక్తిగత పని నిమిత్తం ముసలమ్మ చెట్టు గ్రామం నుంచి పెద్దవూర వైపునకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో వై జంక్షన్ వద్దకు రాగానే హాలియా వైపు నుంచి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంతో నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి సతీశ్ బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో సతీశ్ చేయి పూర్తిగా నుజ్జు కావడంతో స్థానికులు గమనించి 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు పేర్కొన్నారు.

క్రికెట్ కిట్టు అందజేత

పెద్దవూర, జనవరి 19 : మండలంలోని తంగీళ్లతండా, సుద్దబావితండా గ్రామాల యువతకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి శనివారం క్రికెట్ కిట్లు అందించారు. కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, చామల మధుసూదన్‌రెడ్డి, జినకల యాదయ్య, బనావత్ శ్రీనునాయక్, శ్రీధర్, వంశీ, గిరిధర్, సింహాద్రి, జైరామ్ పాల్గొన్నారు.

యోగి వేమన జయంతి

రామగిరి, జనవరి 19 : జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో కవితా దోస్తాన్ నల్లగొండ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాకవి యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రచయిత, కవి కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు అలుగుబెల్లి రాంరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

పల్లె నుంచి పట్నం బాట


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

కేతేపల్లి, జనవరి 19 : మండల పరిధిలోని కొర్లపహాడ్ గ్రామ శివారులో ఎన్‌హెచ్ 65పై గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం నుంచి వాహనాల రద్దీ పెరిగింది. సంక్రాంతి పండుగ సెలవులు ఆదివారంతో ముగియడంతో జనం పల్లె నుంచి పట్నం బాట పట్టారు.

ముస్లిం ఆధ్యాత్మిక సదస్సు ముగింపు

ఇస్తెమాకు హాజరైన ముస్లింలు

రామగిరి, జనవరి 19 : జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గా ఆవరణలో ఈనెల 17 నుంచి 19వరకు జరిగిన 61వ సాలానా తబ్లీగీ ఇస్తెమా (ఆధ్యాత్మిక సదస్సు) ఆదివారం ప్రత్యేక దువాతో ముగిసింది. ఈ ఇస్తెమాకు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ముస్లిం మతపెద్దలు, మౌలానాలు, ఉలామాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి సుమారు 35వేలకు పైగా ముస్లింలు హాజరయ్యారు. గత 50 ఏండ్లుగా ఈ ముస్లిం ఆధ్యాత్మిక సదస్సు కొనసాగుతుందని ఈసారి కూడా పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చి విజయవంతం చేశారని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ముస్లిం భక్తిభావంతో మెలగాలని మత పెద్దలు సూచించారు. ఈ సదస్సుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

రైతు మహాధర్నాకు తరలి రావాలి

• బీఆర్ఎస్ నాయకుల పిలుపు

శాలిగౌరారం : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్

శాలిగౌరారం జనవరి 19 : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 21న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు మహాధర్నాకు మండలంలోని రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఈ రైతు ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో చాడ హతీశ్‌రెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజలాల్ శేఖర్‌బాబు, నతానియల్, దుబ్బ వెంకన్న, రాపాక రాజు, యామగాని వెంకన్న, మామిడి రమేశ్, అంకర్ల పున్నమినాగులు, మహేశ్వరం వెంకన్న, నిమ్మల సురేశ్, అంబాల కృష్ణమూర్తిగౌడ్, దాసరి వెంకన్న, నూనెముంతల అంజనేయులుగౌడ్, రూపని నాగరాజు పాల్గొన్నారు.

మర్రిగూడ/కట్టంగూర్/ నార్కట్‌పల్లి : బీఆర్ఎస్ రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ మర్రిగూడ మండలాధ్యక్షుడు తోట కూరి శంకర్ యాదవ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అదే విధంగా మహాధర్నాకు తరలి రావాలని కట్టంగూర్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శులు గోలి ప్రసన్నకుమార్, కొండ గణేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని అయిటిపాములలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడగా సాయి కృష్ణ, నవీన్, రామ్, సంతోశ్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. మహా ధర్నాను విజయవంతం చేయాలని నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

సాగుకు యోగ్యం కాని భూముల పరిశీలన

మర్రిగూడ : రాజపేటతండాలో సర్వే చేస్తున్న తాసీల్దార్ శ్రీనివాసులు

మర్రిగూడ, జనవరి 19 : మండలంలోని కమ్మగూడెం, వెంకెపల్లి, తిరుగండ్లపల్లి, రాజపేట తండాలో ఆదివారం రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను సేకరించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సేకరిస్తున్నట్లు తాసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. సర్వేలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఏఈఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మునుగోడు : మండల పరిధిలోని చీకటిమామిడి, ఎలగలగూడెం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ఈ భూములను ఈ నెల 21 నుంచి జరిగే గ్రామ సభలో ప్రదర్శించి తీర్మానించనున్నట్లు ఏఓ పద్మజ పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దంపతులు

మునుగోడు, జనవరి 19 : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధత్వ నివారణ జిల్లా సంస్థ, శంకర్ కంటి దవాఖాన ఫినిక్స్ వారితో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మి ప్రారంభించారు. నియోజకవర్గంలో ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీలు కలుపుకొని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నందికొండ, జనవరి 19 : నాగార్జునసాగర్‌లో పండుగ సెలువులు కావడంతో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొన్నది. కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన లాంచీలో నాగార్జునకొండ, జలీ ట్రిప్పులకు పర్యాటకులు ఆసక్తి కనబర్చారు. పర్యాటకులతో నాగార్జునసాగర్ డ్యామ్, లాంచీ స్టేషన్, బుద్ధవనం పరిసరాలు కిటకిటలాడాయి. నదీ తీరంలో, బుద్ధవనంలో పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు.

లాంచీలో నాగార్జునకొండకు పోయివస్తున్న పర్యాటకులు

22న కబడ్డీ పురుషుల జిల్లా జట్టు ఎంపిక

నందికొండ, జనవరి 19 : సీనియర్ పురుషుల నల్లగొండ కబడ్డీ జిల్లా జట్టు ఎంపికను ఈ నెల 22వ తేదీన గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.భూలోకరావు, కార్యదర్శి జి.కర్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు 85 కేజీల బరువు ఉండి, ఒరిజినల్ ఆధార్‌కార్డును తమ వెంట తీసుకు రావాలని సూచించారు. ఎంపికైన పురుషుల జట్టు ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో జరిగే 71వ అంతర జిల్లా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

బస్తీ దవాఖానలో సామగ్రి చోరీ

• పట్టించుకోని అధికారులు : కౌన్సిలర్ రమేశ్‌జీ

దవాఖానలో చోరీ జరిగిన తలుపులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నందికొండ, జనవరి 19 : పైలాన్‌కాలనీలోని బస్తీ దవాఖానలో విలువైన సామగ్రి చోరీకి గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ రమేశ్‌జీ అన్నారు. చోరీ జరిగిన దవాఖానను ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పైలాన్ కాలనీలోని బస్తీ దవాఖాన చాలా ఏండ్లుగా నిరుపయోగంగా ఉందని, బీఆర్ఎస్ పాలనలో రూ.13 లక్షలతో దవాఖానను ఆధునీకరించినట్లు తెలిపారు. సేవలందించడానికి సిద్ధంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా దాన్ని ప్రారంభించడం లేదని ఆరోపించారు. దీంతో దవాఖాన మందుబాబులకు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని, ఫ్యాన్లు, డోర్లు చోరీకి గురవుతున్నాయని మండిపడ్డారు. అధికారులు పట్టించుకొని చోరీ చేసిన వారిపై చర్యలు తీసుకొని, దవాఖానను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. హిల్‌కాలనీలోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, పైలన్‌కాలనీలోని 60 ఫీట్ల రోడ్డు, షాపింగ్ కాంప్లెక్స్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వాటిని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రమౌళి, లక్ష్మణ్‌నాయక్, శేఖరాచారి, సైదులు, మల్సూర్, వీరయ్య, బీజేపీ నాయకులు రాజు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

• ఎంపీడీఓ జి.చినమునయ్య

మర్రిగూడ, జనవరి 19 : రేషన్ కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈనెల 21నుంచి 24 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 21న రాంరెడ్డిపల్లి, లెంకలపల్లి, మర్రిగూడ, యరగండ్లపల్లి, శివన్నగూడెం, 22న మేటిచందాపురం, వట్టిపల్లి, తమ్మడపల్లి, దామెర భీమనపల్లి, అంతంపేట, 23న కొట్టాల, అజిలాపురం, కొండూరు, ఖుదాభక్షిపల్లి, నామాపురం, 24న రాజపేటతండా, వెంకేపల్లి, కమ్మగూడెం, తిరుగండ్లపల్లి, సరంపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు గ్రామసభల్లో పాల్గొని తమ అభిప్రాయాలను తెలుపాలని ఎంపీడీఓ సూచించారు.

నల్లగొండలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, జనవరి 19 : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యం చెల్క, దారుషఫా కాలనీ, బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, బీటీఎస్, శంశు నగర్, భారత్ గ్యాస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన గురుకులంలో సోషల్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు

దేవరకొండ రూరల్, జనవరి 19 : మండలంలోని పెంచికల్‌పహాడ్‌లో గల గిరిజన గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ సోషల్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కల్యాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులు బయోడేటాతో మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు సర్టిఫికెట్లతో పాఠశాలలో దరఖాస్తు సమర్పించాలని ఆమె పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాలు వేలం

దేవరకొండ రూరల్, జనవరి 19 : మండలంలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 21న వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదల్చిన వారు మంగళవారం ఉదయం 10 గంటలకు దేవరకొండలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బైక్‌కు రూ.10వేలు, ఫోర్‌వీలర్‌కు రూ.30వేల చొప్పున డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. వేలంలో వాహనం కొనుగోలు చేయకపోతే డిపాజిట్ అమౌంట్ తిరిగి చెల్లించబడుతుందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మర్రిగూడ, జనవరి 19 : మండలంలోని రాంరెడ్డిపల్లి సమీపంలో గల చెర్లగూడెం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎం. కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని లోయపల్లికి చెందిన బూడిద రాములు(70) స్వగ్రామం నుంచి నాంపల్లి మండలంలోని వడ్డేపల్లికి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. చెర్లగూడెం మూలమలుపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజంపై పోటీలు : డీఈఓ

రామగిరి, జనవరి 19 : జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు నియోజక వర్గ స్థాయిలో ఈనెల 22న మాదక ద్రవ్యాల రహిత సమాజంపై వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలను నిర్వహించనున్నట్లు డీఈఓ బి.భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పెద్దవూర జడ్పీహెచ్ఎస్, మునుగోడు, తిప్పర్తి, బి.వెల్లెంల (నార్కట్‌పల్లి), కొండమల్లేపల్లి, నకిరేకల్, జడ్పీహెచ్ఎస్(బాలికలు) విద్యార్థులకు మిర్యాలగూడలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఆరుగురు విద్యార్థులను ఈనెల 24న జిల్లా కేంద్రంలోని డైట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను ఈనెల 26న కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, 98485 78845 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వ్యాసరచన పోటీల అంశాలివే..

- మంచి స్నేహితుడిగా తోటి వారిని డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడడం ఎలా?
- ఆల్కహాల్ అండ్ డ్రగ్స్ ఎందుకు ప్రమాదకరం. సురక్షిత బాల్యానికి మార్గాలు

ఉపన్యాసం అంశాలు..

- శారీరక, మానసిక ఆరోగ్యంపై డ్రగ్స్ అండ్ ఆల్కహాల్ దుష్ప్రభావం
- డ్రగ్స్ రహిత బాల్యం కోసం క్రీడలు, శారీరక వ్యాయామాలు
- పై అంశాలపై పాటలు కూడా పాడవచ్చు

గ్రామీణ యువత ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడలు : డీఎస్పీ

డీఎస్పీ రాజశేఖర్‌రాజును సన్మానిస్తున్న క్రీడా పోటీల నిర్వాహకులు

మిర్యాలగూడ, జనవరి 19 : గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడుతాయని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. పట్టణంలో క్లియో స్పోర్ట్స్‌లో ది తెలంగాణ క్రికెట్ అసిసోయేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గోల్డ్ కప్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ కావలి వెంకన్న, బ్యాడ్మింటన్ కోచ్ మారబోయిన రామకృష్ణ, క్లియో మేనేజర్ నేతి రాహుల్, నిర్వాహకులు పోతుల నరేందర్, తీపిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కోచ్ రాజు, జవహర్‌నాయక్, ఫణికుమార్, గౌస్ తదితరులు ఉన్నారు. అదే విధంగా పట్టణంలోని రామచంద్రగూడెం ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జనయేత్రి ఫౌండేషన్ నాలుగో ఆత్మీయ సమ్మేళనంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మునీర్‌అహ్మద్, సాజిదాఖాన్, నర్ర లక్ష్మీసామ్రాజ్యం పాల్గొన్నారు.

మాల్ వాసికి త్వష్టబ్రహ్మ అవార్డు

బ్రహ్మచారికి అవార్డు అందిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

మాల్, జనవరి 19 : హస్తకళ నైపుణ్యంతో పలు రాష్ట్రాలకు లోహ శిల్పాలు, వివిధ కళాఖండాలను అందించడంతో పాటు విశ్వకర్మ వ్రతకల్పం, సోమశతకం రాసినందుకు గాను చింతపల్లి మండల పరిధిలోని గొడకొండ్లలోని మాల్ వాసి సోమ బ్రహ్మచారికి అమర శిల్పి జక్కనాచార్య త్వష్టబ్రహ్మ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని బీఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేముల వాడ మధున్‌మోహన్ అధ్వర్యంలో శనివారంనిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాజీ శాసన సభాపతి మధుసూదనాచారి ఈ అవార్డును బహ్మచారికి అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు లాలుకొటాట వెంకటాచారి, మహిళాధ్యక్షురాలు లక్ష్మీరామాచారి, చొల్లేటి కృష్ణమాచారి, పిటంపల్లి రామలింగాచారి, ముంజంపల్లి మోహన్, మణి, శివరామాచారి పాల్గొన్నారు.

బస్సులో మర్చిపోయిన బ్యాగు అందజేత


నాగమ్మకు బ్యాగు, నగదును అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నార్కట్‌పల్లి, జనవరి 19 : పాలకవీడు మండల కేంద్రానికి చెందిన మీసాల నాగమ్మ కోదాడ డిపో బస్సును మిర్యాలగూడలో ఎక్కి హైదరాబాద్‌కు బయల్దేరింది. మార్గ మధ్యంలో నార్కట్‌పల్లి బస్టాండ్‌లో వాష్‌రూమ్ కోసం బస్సు దిగిన మహిళ తిరిగొచ్చే లోపు బస్సు డ్రైవర్ మరిచి పోయి వెళ్లిపోయాడు. దీంతో బస్సులో తన విలువైన బ్యాగు ఉండిపోయిందని బాధిత మహిళ బస్టాండ్ సిబ్బందికి తెలియపర్చడంతో వారు అప్రమత్తమై ఆ బస్సును చిట్యాల వద్ద ఆపి పరిశీలించారు. అందులో నాగమ్మ బ్యాగు ఉండడంతో బ్యాగును, అందులోని నగదును బాధితురాలికి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు.

రైతాంగానికి మద్దతు ధర చట్టం చేయాలి : వీరారెడ్డి

రామగిరి : మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

రామగిరి, జనవరి 19 : రైతుకు గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్నందున కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. నల్లగొండలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవ సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. సదస్సులో రైతు సంఘం జిల్లా నాయకుడు కుంభం కృష్ణారెడ్డి, ఊట్కూరి నారాయణరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, సరోజ, భూతం అరుణ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.